# శివానందలహరి

ఈమధ్యే పెళ్ళయిన ప్రఖ్యాత ఫిలిం సంగీత దర్శకుడు శివరావు భార్య గీతాదేవితో కలిసి సినిమాకు బయలు దేరాడు.

అరలక్ష ఖరీదుచేసే ఎర్రని మెరుపులాంటి కారును నగరం వీథుల్లో నడుపుతూ భార్యతో అన్నాడుః "నువ్వు 'బికారి' చూశావా గీతా?" చూసిందని తెలుసు. అయినా సరదాకి.

ప్రశ్నకి తగ్గట్టుగానే గీతాదేవి అందంగా వెగటు నటిస్తూ "చూశానుకాని, మ్యూజిక్ ఘోరంగా వుంది డార్లింగ్!" అంది. ఆవిడేదో పెద్ద జోక్ వేసినట్లు శివరావు గలగలా నవ్వి "సారీ అమ్మగారూ, అది మా మొదటి ప్రయత్నం. మాకు ఆ రోజుల్లో అన్నీ కొత్తే. ఫిలిం స్టూడియోలు, డైరెక్టర్లూ, కెమెరాలూ అన్నీ కొత్తే. పియానోని చూస్తే నాకు భయం వేసేది.

ఇంక గాయనీ గాయకుల్ని రిహార్స్ చేయించడం అంటే ఒణుకూ, ముచ్చెమటలూను. కాని చిన్నంరాజుగారు-నిజంగా దేవుడే ఆయన-మాకు అడుగడుగునా ఉత్సాహం ఎక్కించి మాచేత ఆ పని పూర్తి చేయించాడు," అన్నాడు.

చిన్నంరాజు ప్రపంచ ప్రఖ్యాతి పొందిన సినిమా నటుడు, దర్శకుడూను. అతను 'బికారి' చిత్రం స్వయంగా నిర్మిస్తూ, బికారులుగా రోడ్ల మీద పాటలు పాడుతూ బతుకుతున్న శివ రావు-కృష్ణమూర్తి జంటను పట్టుకొచ్చి వాళ్ళచేత సినిమాకి మ్యూజిక్ యిప్పించాడు. 'బికారి' చలనచిత్రచరిత్రలో కొత్త శకానికి నాంది అయింది. దాంట్లో ప్రతీ పాటా బ్రహ్మాండమైన హిట్ అయింది.

బికారి ఆడుతున్న హాలు 'గ్లోబ్' దాదాపు నగరం బయట మురికి పేటల్లో వుంది. అంచేతే శివరావుకి అక్కడ ఆటోగ్రాఫ్‌ల కోసం అంటూ ఎవరూ తగల్లేదు. బాక్స్ టికెట్లు కొని గీతతో మాట్లాడుతూ హాల్లో కెళ్ళాడు రావు. న్యూస్ రీల్ నడుస్తోంది.

"నువ్వు ఊహించలేవు గీతా. నేను ఈ ప్రాంతాల్లోనే నా చిన్నతనం అంతా గడిపాను. అమ్మ నా మూడో ఏటనే పోయింది. నాన్న తరువాత ఎటో పోయాడు. పేవ్‌మెంటు మీది బికారులు కొందరు నన్ను పెంచుకున్నారు...." శివరావు మాట్లాడుతూండగానే 'బికారి' టైటిల్స్ తెరమీద కొచ్చాయి.

అది మామూలు చిత్రం కాదు. చలన చిత్రాల్లో విప్లవం తెచ్చింది. అది నిర్మించిన చిన్నంరాజుకి అప్పుడు ఇరవై రెండో ఏడు. కథ, మాటలు రాసిన సుబ్బారావు ప్రసిద్ధ అభ్యు దయ రచయిత. ఇక మ్యూజిక్ డైరెక్టర్లు శివరావు-కృష్ణమూర్తి.

అందరికీ ఒక్కసారి ఊపిరి, గుండె ఆగిపోయాయి. విడుదలై పదేళ్ళయినా మోజు పోనివాళ్ళే అందరూను. గీతాదేవి కూడా అలాగే ఏదో ఇంద్రజాలాన్ని చూస్తున్న వింతతో, దిగ్భ్రాంతితో సినిమా చూస్తోంది. సినిమాలో వచ్చే పాటల్లోని కొన్ని భాగాల్ని వాద్యాల మీద వినిపిస్తున్నారు టైటిల్స్‌లో.

మరీ ఎక్కువ ప్రజాదరణ పొంది 'నేను బికారినే....' అనే పాట ఎకార్డియన్ మీద రాగానే గీత వొళ్ళు పులకరించింది. ఆ పాటని సృష్టించిన తన భర్త చేతిని గట్టిగా పట్టుకుని నొక్కింది. శివరావు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు అయిదేళ్ళ పిల్లాడిలా. అతని ఒళ్ళు ఏడుపుని అణిచే ప్రయత్నంలో ఒణికిపోతోంది.

"డార్లింగ్, ఏమిటి..." గీతాదేవి కంగారుగా అతన్ని అనునయించడానికి ప్రయత్నిస్తూ అతని కంపిస్తున్న హృదయంపై చేయి వేసింది. శివరావు ఆతృతగా గీత చేతిని తన రొమ్ము మీద అదుముకుంటూ "పోదాం గీతా, నా మనస్సు....సారీ" అని లేచాడు. కన్నీళ్ళతో మరింత మసకైన ఆ చీకట్లో గీతాదేవి అతన్ని నడిపించి కారు దగ్గరకు తెచ్చింది. కార్లో కూచున్నాక అతని కళ్ళూ, ముఖం తుడిచి ఇంటికి డ్రైవ్ చేసుకుపోయింది. శివరావు ఏడుపు ఆగిపోయింది కాని, వర్షం ఆగాక చెట్ల ఆకుల్నుంచి గాలి వీచినప్పుడల్లా పెద్దగా రాలే పెద్ద చినుకుల్లా వెక్కిళ్ళు వస్తూనే వున్నాయి.

తన ఒళ్ళో తలపెట్టుకు పడుకున్న భర్తచేత కొంచెం కొంచెం బ్రూ తాగిస్తూ ఆందోళనని కప్పిపుచ్చే చిరునవ్వుతో అతని కందిన మొహాన్ని చూస్తోంది గీతాదేవి. వాళ్ళ కళ్ళు కలవగానే శివరావు కళ్ళల్లో మళ్ళీ నీళ్ళు తిరిగేయి. గీతాదేవి అతని కళ్ళు ముద్దు పెట్టుకుని "ఎందుకురా బుజ్జీ..." అంది.

"నేనింక పాటలు కట్టలేను. ఆఖరు!"

అర్థంకాక గీతాదేవి గట్టిగా నవ్వింది. ఉషారు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తూ "అయితే మనం హనీమూన్‌కి యూరప్ పోదాం. నాకు పారిస్ చూడాలనివుంది ఎన్నాళ్ళనించో. హాయిగా వుంటుంది" అంది. కాని అతని ముఖాన్ని మబ్బులా కమ్మిన దిగుల్ని చూసి ఏం తోచకముని వేళ్ళతో అతని బుగ్గలు నిమురుతూ "ఎంత అందంగా వున్నావురా!" అంది. శివరావు కూడా కొంచెం నవ్వి "నీ అందమే ప్రతిఫలిస్తోంది" అన్నాడు.

గీత మురిసిపోతూ, ముద్దుగా "మరి నేనంత ఇష్టమైతే అంద దిగులు దేనికి? నేను బికారి మ్యూజిక్ బాగులేదన్నానా? ఉట్టిది. నాకు ఆ సినిమాలో పాటలు అన్నీ ఇష్టమే-పదేళ్ళయినా. తరువాత మీరిచ్చిన పాటలు ఇంకా బాగున్నాయనుకో. కాని బికారి అందం వేరు. అది ఏ స్వప్నలోకంలోకో తీసుకుపోతుంది" అంటూ అతన్ని ముద్దుల్తో ముంచేసింది. కాని ఇదంతా తన ఆందోళనని తరిమేయడానికే. సినిమాకి ఎంతో ఆనందాన్ని ఎదురుచూస్తూ వెళ్ళింది తను. కాని అక్కడ ఈ పెద్దమనిషి అంత హడావిడి చేశాడు. పెళ్ళయి మూడు నెలలే అయింది. అతను తనకేమీ తెలియనట్లే లెక్క.

గీతాదేవి పాతికేళ్ళ లోపు. కానీ చాలా జీవితం చూసింది. నటించడానికి నగరం

పారిపోయి వచ్చి కావల్సినవాళ్ళకి దూరమైంది. ఆమె అందం, తెలివీ, అంతకిమించి సంస్కారం; సినిమా ప్రపంచానికి పనికిరాలేదు. అప్పుడప్పుడు చిన్న వేషాలు ఇస్తూ వచ్చారు. స్థిరమైన ఆదాయం, బయటకు వచ్చే దారీ లేక రకరకాల మార్గాల్లో ఆ సినిమా అడవిలోనే తిరుగుతూ వచ్చింది. శివరావు ఆమెని రెండు మూడేళ్ళుగా ప్రేమిస్తూ వచ్చి మూడు నెలల క్రితం పెళ్ళాడేశాడు.

"పాపం-శేషగిరి చచ్చిపోయాడు. అప్పుడే ఏడాది దాటింది" తనలో తను మాట్లాడుతున్నట్లు అన్నాడు శివరావు.

"శేషగిరి ఎంత గొప్పవాడో తెలుసా గీతా. అతను లేకపోతే మా సంగీతం లేనే లేదు. మమ్మల్ని మొదట్లో చిన్నంరాజుగారు తప్ప ఎవరూ తీసుకునేవారు కాదు. శేషగిరి అప్పటికే పెద్ద సినిమా కవి. కాని అతనికి మాతోనే కలిసింది. మాకు గురువులాంటి వాడు అతను."

"మేం ఎలా మ్యూజిక్ కట్టేవాళ్ళమో విను. తమాషాగా వుంటుంది. నేను షేక్ కాంట్ నగర రాజ కుమారుణ్ణి. కృష్ణమూర్తి కొంచెం వున్నవాడు. వాళ్ళ ఇల్లంతా సరికొత్త డబ్బా రేకుల్తో కట్టింది తెలుసా? అద్దె ఇల్లే అనుకో" శివరావు నవ్వేడు. గీత కూడా నవ్వింది. అంచేత మేం సంగీతం నేర్చుకోనేలేదు. రోడ్లమీద తిరుగుతూ ఎక్కడ భజనలూ, హరికథలూ జరిగితే అక్కడకు పరిగెత్తేవాళ్ళం. తెలిస్తే కృష్ణగాడి నాన్న వాణ్ణి చావకొట్టేవాడు. కాని నాకు అలాంటి అడ్డే లేదు. అందుకే నేను అన్నీ వినేవాణ్ణి. అప్పుడు పాటల్తో వున్న నాటకాలు బాగా ఆడేవారు. ఎలాగో సందు చూసుకుని దూరిపోయి ఆ పాటలూ, సినిమా హాలు ఇవతల నిలుచుని ఆ పాటలూ వినేవాళ్ళం. ఇందాకా మనం వెళ్ళేం, గ్లోబ్? అదే హాలు!"

గీతాదేవి ఈ మాటలు ఊపిరి బిగపట్టి వింటోంది తన పెద్ద పెద్ద కళ్ళప్పగించి చూస్తూ.

"నేను మొండివాణ్ణి. కృష్ణ కొంచెం పిరికి. నేను ఎంతో కష్టపడి ఏరుకొచ్చిన సిగరెట్ పీకలు వాడికి ఊరికే ఇచ్చినా కాల్చేవాడు కాదు. వాడికి స్మోకింగ్ నేర్పేసరికి తాతలు దిగొచ్చారు."

"అబ్బ ఎంత కష్టపడ్డావోయ్. ఇంతకీ అప్పుడు ఎన్నేళ్ళు నీకు?"

"పది. కృష్ణకి ఎనిమిది. కాని అప్పటికే నాకు దరిద్రుల జీవితంలో తెలియని రహస్యాలు మిగల్లేదు. ఆ పేవ్‌మెంట్ మీదే, రోడ్డు దీపాల క్రీనీడల్లో ఇళ్ళు లేని కూలీలు, బికారులూ, కేడీలూ, బిచ్చగాళ్ళు అంతకంటే కోరదగ్గది లేనట్లు. ఇప్పుడు మనం మన బంగ్లాలో వున్నంత తాపీగా బతికేవారు. ఎంత ఘోరం! వాళ్ళకి అన్ని అదృష్టాలతో పాటు, ఆశకూడా లోపించింది. అదో పెద్ద సమస్య కాదన్నట్లు ఆ పేవ్‌మెంట్ మీదే అన్ని వ్యవహారాలు జరుపుకునే వారు. వంట, భోజనం, డబ్బు లావాదేవీలూ, జూదం, వ్యభిచారం, పోట్లాటలూ, ఒక్కొప్పుడు కత్తులతో. ఆ రోడ్ దీపాల కీనీడల్లో ఎంత జీవితం చూశానో. భయం, బీభత్సం, ప్రేమ, దయ అన్నీ నా లేత వయస్సులో నన్ను ఎద్దుల్లా కుమ్మి పోతూ వుండేవి."

"కాని గీతా! ఆ ఘోరాలన్నీ చూస్తూ, పాల్గొంటూ, అనుభవిస్తూ కూడా నేను పాడవలేదు. పది ఏళ్ళు దాటాక నేను చిన్న చిన్న కూలి పనులు చేసేవాణ్ణి. మా మామ్మ

పకోడీలు అమ్మి, ఏదో కొంత తెచ్చేది. అది తర్వాత చచ్చిపోయిందిలే కారుగుద్దేసి. కాని ఏం చేస్తున్నా నా మనస్సులో ఏదో పాటే మెదులుతూ వుండేది.

"అంతేకాదు. సిగరెట్లు తప్ప వాళ్ళ వ్యసనాలేవీ నన్నంటలేదు ఎంచేతో మరి."

"నువ్వు బంగారానివి మరి."

"ఓనా డేమైందంటే మాతోపాటే సౌదామిని అనే అమ్మాయి వుండేది. ఆమె వృత్తి వ్యభిచారం. చిన్నప్పట్నుంచీ ఆమె రోడ్డు మీదకెళ్ళి ఎవణ్నో ఒకణ్ణి పట్టుకు రావడం, ఏ నీడకో తీసికెళ్ళి వాడితో పడుకోవడం అనేక సార్లు చూశాను. నా పదిహేనో ఏట కాబోలు; ఓరోజు వర్షం బాగా పడ్డరోజు. సౌదామిని జాకెట్ గుండీలు విప్పేసి నన్ను తన కదుముకుని ఓ మూలకి లాక్కుపోయింది ఏదో అస్పష్టంగా మాట్లాడుతూ. నాకు ఆ విషయంలో తెలియని రహస్యాలేం లేవుగా, అంచేత ఆమె ఉద్దేశం వెంటనే అర్థమైంది. మాట్లాడకుండా విడిపించుకుని, ఆమె చేతిలో ఓ రూపాయి పెట్టి అక్కణ్ణించి వచ్చేశాను. ఆ రోజు రాత్రంతా వీథులు తిరుగుతూనే గడిపాను."

"నా పదో ఏట కృష్ణమూర్తి కలిశాడు. ఇద్దరం కలిసి ఎక్కడ పాట వినిపిస్తే అక్కడికెళ్ళి వినేవాళ్ళం. నాకు సంగీతం నా సొంత వస్తువు అన్నట్లు వుండేది. ..ఎలా చెప్పడం. ఊఁ ఇలాగ. రోడ్డు మీద వెళ్తున్న బాతులు చెరువు కనపడగానే అందులో దూకి ఈదినట్లు. అంత సహజంగా నేను సంగీతం వేపు వెళ్ళాను ఏ ఉద్దేశమూ లేకుండా."

"తర్వాత అనుకున్నట్టుగానే కృష్ణమూర్తి ఫోర్తు ఫారం ఫేలయ్యాడు. వాళ్ళ నాన్న కొట్టాడు వాణ్ణి. ఇద్దరం కలిసి బతకడం మొదలెట్టాం. కృష్ణ వాళ్ళమ్మ దగ్గర దొంగతనంగా అడిగి పదిహేను రూపాయిలు తెచ్చి ఓ హార్మోనియం కొన్నాడు. ఓ ఏడాది నేను హార్మోనియం వాయిస్తూ పాడ్డం, వాడు తబలా ప్రాక్టీస్ చేశాం.

శివరావు పక్కనే పడుకుని గీతాదేవి వింటోంది. అతని జీవితం ఎంతో వింతగా వుంది. ఇన్నాళ్ళూ తనకి ఎప్పుడూ చెప్పనే లేదు.

"గీతా. మనం ఇప్పుడు పడుకున్నామే. అలాగే నేనూ, కృష్ణా పడుకునేవాళ్ళం రకరకాల పథకాలు వేస్తూ. మేం సినిమాల్లో చేరాక శేషగిరి కూడా మా మధ్య పడుకునేవాడు. శేషగిరి పాట రాసేవాడు. దాంట్లో భావాన్ని మాకు అర్థమయ్యేలా ఎన్నో ఉదాహరణలూ, కథలూ చెప్పేవాడు. అలా గంటల తరబడి గడిచిపోయేది. ఎక్కడో అతను చెప్పిన ఏ సంఘటనో నా హృదయానికి తగిలేది. నాకూ దాదాపు అలాంటి అనుభవమే జరిగి- ఆగు బ్రదర్ - అనేవాణ్ణి."

"ఆ సంఘటన నా కళ్ళ ముందు కొచ్చేది. మాట వరసకి కులట అనే సినిమాకి మేం పాటలు కట్టాంగా. అందులో పాట ఒకటి రాశాడు శేషగిరి. అది విటుల్ని ఆహ్వానిస్తూ వేశ్య పాడేది. ఆ పాటంతా చెప్పాడు. వేశ్య పిలుపులో సిగ్గు వుంది. అంచేతే అంత సిగ్గులేనితనంగా ప్రవర్తిస్తుంది. బాధ వుంది, అందుకే విలాసాలు ఒలకపోస్తుంది. ద్వేషం వుంది, అందుకే అంత వలపు చూపిస్తుంది. ఇలా చెప్పుకు పోయేవాడు శేషగిరి. నేను వ్యభిచారం - అందులోనూ అత్యంత నికృష్ట స్థాయిలో చూసినవాణ్ణిగా. ఎక్కడో అతని మాటలు నా అనుభవాల్లో దేనికో

వ్యాఖ్యలా, నేను చూసిన ఓ చిత్రానికి మకుటంలా అతికేవి. అంతే. నా గుండె జివ్వుమనేది. ఆ అనుభవం నాకే అవుతున్నంత నిజంగా స్ఫురించేది."

గీత అతని గుండె మీద చెవి ఆనించి పడుకుని "సైకో ఎనాలిసిస్ బాగానే వుంది. కాని దాంటోంచి పాట ఎలా వచ్చిందోయ్. ఆ మిగతా పని మీ మామ్మ చేసేదా?" అంది.

"పాటకేం. నేనెప్పుడు పాటల్లో మునిగే వుండేవాణ్ణి. ఆ సంఘటనకి తగిన పాట ఏదో ఒకటి పాతది వుండే వుంటుంది కదా. ఏవో జావళీయో, ప్రేమ గీతమో, లేక నేను విన్న సినిమాల్లో ఏ నౌషద్ కట్టిన పాటో నామనసుని తడ్తుంది. కాని నా అనుభవంలో వున్న ఉద్రేకాలూ, భావాలూ ఆ స్వరాన్ని కొంచెం సాగదీసి, కొన్ని చోట్ల కుదించీ, కొన్ని చోట్ల వేడి చేసి, కొన్ని చోట్ల నాన బెట్టి ఓ కొత్త వరస తయారయ్యేది. ఇంక మిగిలేది దాన్ని తోమితోమి ... బూట్ పాలిష్!

ఇద్దరూ కొంచెం సేపు గట్టిగా నవ్వుకున్నారు. "అదీ వరస"

"అమ్మ దొంగా. నీ మ్యూజిక్ అంతా కాపీయే. ఎంత మాయ చేశావ్. నువ్వేదో సంగీత నిధివని నమ్మి నిన్ను పెళ్ళాడాను."

"అలాగే అనుకో. కాని మా పాటలు రష్యాలో కూడా మెప్పు పొందాయి తెలుసా?" మూతి బిగించాడు శివరావు. అతనికి కొంచెం కోపం వచ్చింది. అది గ్రహించి గీతాదేవి మాట మార్చింది. "నిన్న చిన్నంరాజుగారు వచ్చి చాలాసేపు కూచున్నారు మనింట్లో. నువ్వు నిద్దరోతున్నావు. ఆయన చాలా సేపు మీ మ్యూజిక్ గురించే మాట్లాడారు. నువ్వు ఎప్పటికీ నిద్ర లేవకపోతే నేను లేపుతానన్నాను 'ఒద్దు. వాడు నిద్దట్లోనే పాటలు కడతాడమ్మాయి. డిస్టర్బ్ చేయను' అని వెళ్ళిపోయారు" అంది.

"నిజంగానే అలా అన్నారూ! చెప్పలేదేం. నే చెప్పానుగా చిన్నంరాజుగారికి అన్నీ తెలుసు. నిజం గీతా. నేను కలల్లో చాలా పాటల వరసల్ని కలగన్నాను. దాగుడు మూతలు సినిమాకి అలాగే అయింది. అది చాలా సరదాగా వుండే కథ. చిన్నంరాజుగారు హీరో. శిరీష హీరోయిన్. నాకు మతిపోయింది. ఎంత తన్నుకున్నా మూడ్ రావడం లేదు. సినిమా స్క్రిప్ట్ అంతా నాలుగుసార్లు చదివాను. చిన్నంరాజుగారు స్టూడియోలో ఓ పెద్ద పార్టీ యిచ్చారు. అందులో రాజుగారూ, శిరీష, మరికొందరు నటీ నటులూ విచిత్ర వేషాల ప్రదర్శనం ఇచ్చారు. నవ్వలేక చచ్చాం మేం. ఆ తర్వాత బాగా తాగి వున్నామేమో ఆ స్టూడియోలోనే మా పక్కలూ ఏర్పాటు చేసుకున్నాం. నాకు ఒకటే కలలు. దాగుడుమూతలు కథ అంతా కార్టూనులా వచ్చింది. అప్పుడు పద్దెనిమిది పాటలు కట్టాను ఆ మెళుకువా నిద్రా కాని స్థితిలో. సినిమాలో ఏడే తీసుకున్నారు."

గీతాదేవి లేచివెళ్ళి శివరావుని భోజనానికి పిలిచింది. అక్కడ చర్చ వంట, రుచులు, వంట వాళ్ళ మీదకి మళ్ళింది. శివరావుకి రుచులంటే చాలా శ్రద్ధ.

భోజనం అయ్యాక టెర్రేస్ మీద పడక్కుర్చీల్లో కూర్చుని దగ్గర్లోనే వున్న సముద్రాన్ని చూస్తూ "గీతా! సొంత బంగ్లా, నౌకర్లూ, సోఫాలూ నీలాంటి పెళ్ళామూ ...దీనికీ నా పదేళ్ళ క్రితం

బతుక్కీ పోలికేమిటి!"

"అదంతా ఓ కల"

"కాదు గీతా. ఇదే కల. అదే నిజం. అందుకే సినిమా హాల్లో అలా అయింది. నా సంగీతం అంతా నా బికారి బతుకే యిచ్చింది గీతా...." అతని ఉద్రేకం హెచ్చిపోతోంది.

"గీతా, అది దరిద్రమే కావచ్చు! రొచ్చూ, రోగాలు, బాధలూ, భయమే. ఎక్కడ చూసినా క్రీనీడలే. కాని అక్కడ నా పాటల వరసలన్నీ, సంగీతం, అంతా అక్కడే పుట్టుకొచ్చింది. కొత్తలో పాటలు కడుతుంటే ఎలా వుండేదో తెలుసా. అది పాట కాదు. నా గుండెల్లోంచి తీసిన ఓ ముక్క. విదేశాల్నించి తిరిగొచ్చి ప్రియురాల్ని కౌగలించుకోబోతున్న ప్రేమికుడి ఆత్రుత. కృష్ణుడి కోసం మీరా, రాముడి కోసం త్యాగరాజు పడే బాధ. ఆకలితో ఏడిచే శిశువు తల్లి రొమ్ముల కోసం వెతుక్కునే ఆరాటం. నన్నర్థం చేసుకో గీతా ఇంకెవరికి చెప్పుకోను"

"నిజమే, అంతా కాదు కాని, కొంచెం అర్థమవుతోంది"

"నువ్వు దేవతవి గీతా ...నువ్వు దేవతవి"

"ఊఁ. మరి సినిమాహాల్లో ఎందుకు అలా ఏడుపొచ్చింది?"

"అదీ చెప్తాను విను. రెండు మూడేళ్ళ క్రితమే నాకు శేషగిరి పాటలు చదువుతుంటే మునుపట్లా వచ్చే పదునైన భావాలు రాకపోవడం గమనించాను. కాని మా పాటలు హిట్ అవడం మానలేదు. ఫరవాలేదులే అనుకున్నాను. కానీ లోపల కొంచెం బెంగగానే వుంది. అది మర్చిపోవడానికే నీ దగ్గర చేరాను"

"నా దగ్గిర వుంటే నీకు బాగుండేదా. నిజంగా?"

"నిజం. ఒట్టు!"

"మరింక బెంగ దేనికి?"

"ఇందాక బికారి సంగీతం వినగానే నా పదేళ్ళనాటి ఉద్రేకాలు, సంగీతం అంటే వుండే తీయని తపనా, అందని కొత్త పాటలకోసం గుండెల్ని మండించే ఆరాటం, అన్నీ జుమ్మంటూ మూగాయి. నేను పోగొట్టుకున్న అనుభూతులవి. అందుకే ఏడుపొచ్చింది. సంగీతం కోసం ఆనాడూ 'బాధే' కాని అది మామూలు బాధ కాదు గీతా".

"నేనున్నాగా పిచ్చివాడా. నా ఒళ్ళో పడుకున్నావుగా అన్నీ మరిచిపోయి హాయిగా వుండు!" అందే కాని గీతాదేవికి నమ్మకం లేదు తన మాటల్లో. ఆమె సినిమా లోకంలో మనుషుల్తో చాలా సన్నిహితంగా బతికి మానవ హృదయాన్ని బాగా చూసింది. కవులూ, నటులూ, మ్యూజిక్ డైరక్టర్లూ, డైరెక్టర్లూ ఎందరో తమ బాధల్ని ఆమెతో పంచుకున్నారు. ప్రతిభ "ఇంకిపోవడం" ఆమెకు కొత్త విషయం కాదు.

మ్యూజిక్ డైరెక్టర్ శ్రీపతి రెండు సినిమాలకి సంగీతం ఇచ్చి దేశాన్ని ఊపేశాడు. మూడో సినీమాలో ఎలాంటి సంగీతం ఇచ్చాడంటే ఓ రివ్యూలో "అన్నట్టు ఈ సినిమాకి సంగీత దర్శకుడు కూడా ఒకడున్నాడు. నమ్మకం కష్టమేగాని" అని రాశారు. అతను ఆ తర్వాత ఓ రోజు రాత్రి గీతాదేవి ఇంటికి తెగతాగి వచ్చి ఆమెను బలాత్కారం చేయడానికి బలహీనంగా

ప్రయత్నిస్తూ తన బాధలు చెప్పుకుని ఏడిచాడు. తనకి ఇన్‌స్పిరేషన్ కావాలట. గీతాదేవి ఒడిలో రెస్టు తీసుకుంటే మళ్ళీ తన వాడిన కళా హృదయం పుష్పించి ఫలిస్తుందిట. అలాగే కొన్నాళ్ళు హాస్యం, తరవాత అపహాస్యం ప్రజలకు అందించి వేషాలు దొరకడం మానేసిన నటులూ, ప్రొడ్యూసర్లు, పోలీసు సహాయంతో గాని రాయించలేని రచయితలూ, ఇమిటేట్ చెయ్యడానికి కూడా ఓపిక నశించిన డైరెక్టర్లూ ...ఎందరో ఆమె కళ్ళముందు మెదిలారు.

కళాకారుడి హృదయం మామూలు హృదయం కంటే విశాలమైనదీ, పంచదారతో చేసినదీ. వాడికి కష్టాలూ, బాధలూ వచ్చి ఆ తీపిని కప్పేయాలని చూస్తాయి. వాడు అదును చూసుకుని వాటిని తన హృదయంలోని తీపితో కలిపి బయటకు విసిరేస్తాడు. అదే కళాసృష్టి. కొన్నాళ్ళకి మళ్ళీ వాడి హృదయంలో ఉత్తి పంచదారే మిగులుతుంది. అది ఇవ్వడానికి వాడికంత ఆరాటం వుండదు. అప్పుడు వాడు ఎండిపోయాడని ప్రజలూ, వాడి పోషకులూ భావించి మరొణ్ణి వెతుక్కుంటారు. ఇదీ గీతాదేవి అంచనా. నిద్రపోతున్న శివరావుని ఇంకా దగ్గిరగా లాక్కుని ఇంకా అదే ఆలోచన కొనసాగించింది.

శివరావు, క్రిష్ణమూర్తి జంట ఇచ్చిన సంగీతం దేశం మీదికి భావాల జలపాతంలా, ఉద్రేకాల హోరులా విరుచుకు పడింది. వాళ్ళ పాటల్లో టెక్నిక్ కంటే ఫీలింగ్ ఎక్కువ. అందుకే అవివింటే అంత నిషా వస్తుంది జనానికి. వాళ్ళ పాటలు గీతాదేవి మనస్సులో ప్రతిధ్వనించాయి. పరుగు పరుగుల్తో వచ్చి వాళ్ళ పాటల భావం ఏదైనా సరే- అది విరహం కావచ్చు, విషాదం కావచ్చు; నిరాశ కావచ్చు, ఒక ఉత్సాహంతో నిండి వుంటాయి. ఒడ్డుని చేరుతున్న కెరటం మీద వచ్చే నురుగులా ఆ ఉత్సాహం దాని అడుగున హోరుమని ధ్వనిచేస్తూ మానవ హృదయాన్ని పగల గొట్టే భావాలూను. ఈ పదేళ్ళలో రెండు వందల పాటలు కట్టారు వాళ్ళు. దాదాపు అన్నీ ప్రజలు మెచ్చినవే.

వాళ్ళు ఎంత బాధని మింగగలిగారో ఊహించగానే గీతాదేవికి బాధతో హృదయం ద్రవించిపోయింది. "నా చిన్న శివుడూ! ఎంత హాలాహలాన్ని మింగావోయ్ నువ్వు. ఫరవాలేదులే. ఇప్పుడు చాలా వరకు వదుల్చుకున్నావుగా. ఇంక హాయిగా వుండు" అని నిద్రపోతున్న శివరావుతో మాట్లాడింది గీత.

ఉన్నట్టుండి మరో ఆలోచన వచ్చి ఉలిక్కిపడింది గీత. కళాకారులు ఏ పనీ లేకపోతే తోచక, అహంకారం దెబ్బతిని తాగుడో, మరోటో హాబీ చేసుకోడం కద్దు. పాటలు కట్టడం మానేస్తే శివరావు కూడా అలా నాశనమవుతాడేమో అనే భయంతో "శివుడూ, బుజ్జీ..." అంటూ కుదిపేసి అతన్ని నిద్రలేపింది. శివరావు రీవిగా ఓ నవ్వు విసిరి మళ్ళీ నిద్రకు పూనుకున్నాడు. "అప్పుడే నిద్రా. నాకేం తోచడం లేదు. పచ్చి స్వార్థపరుడివి" అని గోల చేసింది.

శివరావు లేచి కూచున్నాడు. ఆవలిస్తూ "ఏమిటి పిల్లా" అని అడిగాడు.

"ఏం లేదు. చిన్నంరాజుగారు కొత్త సినిమా తీస్తున్నారుటగా. దానికి పాటలు కట్టారో లేదోనని"

"మేం దానికి మ్యూజిక్ ఇవ్వం. చెప్పానుగా. నాకు భయం పట్టుకుందని"

"కాని ఆయన దానికి మీరే మ్యూజిక్ ఇవ్వాలనీ, లేకపోతే అసలు ఆ సినిమా తియ్యనని అంటున్నాడు.

"మేం ఇవ్వం" మొండిగా రొక్కాయించాడు. గీతాదేవి నవ్వింది.

"రిటైరై పోతావా? బేంక్‌లో ఎంతుందేమిటి"

"నాలుగు లక్షలు. దాంతో మనమూ, మన పిల్లలూ హాయిగా బతకచ్చు.

"ముప్పై రెండేళ్ళకి రిటైరై ఏం చేస్తావు"

"ఏం చెయ్యను. నీతో సంసారం చేస్తాను"

"బోరు కొట్టేస్తుంది. చచ్చిపోతాం"

వీధి గుమ్మంలో ఎవరో వచ్చి బెల్ నొక్కారు. వెళ్ళి తలుపు తీశాడు శివరావు. కృష్ణమూర్తి!

శివరావు ఆ సంగతి చెప్పడానికి కూడా రాకుండా తన స్టూడియోలోకి వెళ్ళిపోయాడు కృష్ణమూర్తితో. కొంత సేపయ్యాక హార్మోనియం, తబలా మోత, తరువాత పియానో కూడా వినిపించాయి. వాళ్ళ గొడవ పూర్తయేసరికి తెల్లారుతుంది. గీతాదేవి దీర్ఘంగా నిట్టూర్చి నిద్ర పట్టించే పుస్తకం కోసం షెల్ఫ్ దగ్గరకు వెళ్ళింది.

(ఆంధ్రజ్యోతి; వీక్లీ–దీపావళి 1988)

★